# నా పరీక్ష

పల్లెటూరు అవటమువలన మా వూళ్లో మూడవ ఫారమువరకే చదువున్నది. మా అన్నయ్యకీ మా నాన్నగారికీ ఆడవాళ్లు చదువుకోవడం ఇష్టం. అదీ కాకుండా నాపట్టుదలకూడా నా పై చదువుకి కొంతపనిచేసింది. ఎల్లాగయితేనేం నేను పట్నంలో మా పినతండ్రిగారింట్లో చదువుకున్నాను.

కె. కావేశ్వరి

నేను స్కూల్ ఫైనల్ పరీక్షలు రాసి అప్పుడే ఇంటికొచ్చాను. మా అక్కయ్య తప్పించి, నన్ను అందరూ "బాగా రాశావా" అని అడిగారు. మా అక్కయ్యకీ నాకూ ఎప్పుడూ పొత్తుకుదరదు. మా ఇద్దరికీ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. నేనేమన్నా అంటే అది వూరుకోకూడదుటగానీ, అది పెద్దది గనుక అది ఏమన్నా అంటే నేను ఎదురు చెప్పగూడదుట. మా ఇంట్లో వారందరూ ఇలాగే అంటారు. కాని నాకుమాత్రం దానిపెద్దతన మేమీ కనపడదు. కనుక దానితో సమానంగా నేనూ జగడంవేసుకుంటాను.

ఆవేళకి నాలుగు రోజులనుంచే నేను పరీక్షా ఫలితాలకోసం ఎదురు చూస్తున్నాను. ఆరోజున మామూ

(54-వ పేజీ చూడండి)



"అయినా ఆడవాళ్లకి చదువేమిటి! కాలం మారిపోయింది.

# ★ నా పరీక్ష ★

(35-వ పేజీ తరువాయి)

లుగా మా అక్కయ్యా నేనూ దెబ్బలాడుకున్నాం. "నాతో ఇలా అనవసరంగా దెబ్బలాడుతున్నావు గనుక నువ్వు పాస్ అవ్వవులే"అంది మాఅక్కయ్య. ఇది నిజమేమో అని నామనసులో ఒకమూలపీకుతున్నా, ఇంతలోకే తగ్గకూడదని సమానంగా పోట్లాడేను.

ఇంతలోకే మా తమ్ముడొచ్చి "అక్కయ్యా నాకు తలకి నూని రాయవే" అన్నాడు. నాకు వళ్ళు మండింది. "పోరా వెధవా"అన్నా. ఇంతలో మా అమ్మగారొచ్చి "ఎందుకే వాణ్ని అల్లా కసురుకుంటావు? అక్కతో దెబ్బలాట చాల్లేదా ఏవిటి? చదువుకున్నావు కూడాను. ఎందుకొచ్చిన చదువు తమ్ముడిని సముదాయించే ఓపికయినా లేదు" అంది.

ఇంతలో మా బామ్మ వచ్చి "కూర కొంచెం తరిగియ్యమ్మా" అంది. తరగకపోతే ఈవిడేవంటుందోనని తప్పనిసరిగా వెళ్లి కత్తిపీటమీద కూర్చున్నాను. కూర తరుగుతున్నానన్న మాటే గాని, మా అక్కయ్యా, మా అమ్మా అన్న మాటలు తలుచుకుంటే, నేను నిజంగా పాస్ అవనేమో అని భయం కలిగింది. కూర తరుగుతున్నానన్న మాటే మరిచిపోయాను. ఇంతలో నా వేలు తెగి రక్తం కారింది. ఎల్లాగో అల్లాగ బామ్మ కంటబడకుండా కూర తరుగుదామనుకున్నాను. మా బామ్మ చూడనే చూసింది. "అదేవిటే నీ సుకుమారం మండిపోనూ! రేపు అత్తారింటి కెళ్లినా ఇంతే గావును! అక్కడ నాకు మల్లే ఊరుకునేవాళ్లెవరూ లేరు. (తనేదో ఊరుకున్నట్టు) అయినా ఆడవాళ్లకీ చదువేమిటి? కాలం మారిపోయింది. నాకు నీ యీడుకే మీ నాన్న, మీ అత్తయ్యా కూడా పుట్టారు. నువ్వింకా చిన్న కూచిలాగ కూర తరగడం కూడా నేర్చుకోలేదు. ఒకసారి యిలా చేస్తే రెండోసారి తరగమనరని కాబోలు! ఈకాలపు వాళ్ళకి ఎంతెంత బుద్ధులయినా వున్నాయి!" అంది.

ఈ మాటలన్నీ విన్నాక నా మనస్సు నా స్వాధీనంలో లేకుండా పోయింది. ఇంతలో మా అన్నయ్యొచ్చి "ఏమేవు నీ రిజల్ట్సు పడ్డాయేవు" అన్నాడు. మా అన్నయ్య చేతులోవున్న పేపరు చూసేటప్పటికి నాకు దడ ప్రారంభమయింది. మా అన్నయ్య "నీ నెంబరెంతా?" అని అడిగాడు. వొణుకుతో నానంబరు 19583 అని చెప్పాను. మా అన్నయ్య పేపరుచూసి మూతి విరిచాడు. ఇంతలో మా అక్కయ్య ఒచ్చి "ఎలా పాసవుతుంది? పెద్దా చిన్నా లెఖ్ఖలేకుండా అయిందానికీ కానిదానికీ నాతో జగడం పెట్టుకొంటుంది. ఇంకెల్లా పాసవుతుంది? అది పాస్ అవుతుందని నేను కలలో కూడా అనుకోలేదు" అంది.

ఎప్పుడొచ్చిందో మా బామ్మ. "దీనికింకా చదువెందుకురా! మానిపించి ఇంట్లో కూర్చోపెట్టక" అంది. ఇదంతా వింటుంటే నా తల తిరిగిపోతోంది. నేను ఎప్పుడూ ఫెయిల్ అవుతానని అనుకోలేదు.

మానాన్నగారప్పుడే ఆఫీసునుంచొచ్చారు. "అమ్మాయి నువు పాస్ అయ్యావమ్మా" అన్నారు. మా అన్నయ్య "అదేమిటి నాన్నగారూ మీరు తప్పుచూశారేమో! 19583 నంబరు లేదే" అన్నాడు.

"అదేమిటిరా దాని నంబరు 19283 అని నాతో చెప్పిందే" అన్నారు నాన్నగారు. అప్పుడు గ్రహించాను; నేను కంగారులో అన్నయ్యకి తప్పు నెంబరు చెప్పానని. "నానంబరు 19283 నాన్నగారూ. అన్నయ్యకి తప్పు చెప్పాను" అన్నాను. "అయితే ఇదుగోనమ్మా నీనంబరు"అన్నారు. నా సంతోషానికింక హద్దులేదు. మా అక్కయ్య కోసం చూసేసరికి అది ఎప్పుడో పలాయనమంత్రం పఠించింది. "పోనీ అమ్మా దేవుడి దయవలన పాస్ అయ్యావు అంతే చాలు" అంది బామ్మ. మా అన్నయ్య "బామ్మా దానికి పెళ్లి ఎప్పుడు చేద్దాం"అన్నాడు. "చాల్లేరా అది చదువుకోడం నాకుమాత్రం ఇష్టం లేదూ! ఈరోజుల్లో ఇంతింత వాళ్లు కూడా పెద్ద వాళ్లని ఆక్షేపించడమే" అంటూ వంటింట్లోకి వెళ్లిపోయింది.

ఏమయితే ఏంగాని మా బామ్మా అక్కయ్యల అభీష్టం మాత్రం నెరవేరలేదు. నా చదువింకా సాగుతూంది. ★

రాజా - పేదా
వెల రూ 2-0-0
ఆంధ్రగ్రంథమాల, మద్రాసు-1